# రచన మాసపత్రిక

అమెరికాలో సీయస్సీ మురళి, తెలుగునాట వై. రాంబాబు & శాయి- కలిసి ప్రారంభించిన 'రచన' మాసపత్రిక- తొలి సంచిక దీపావళి ప్రత్యేక సంచికగా 1991 డిసెంబర్లో విడుదలైంది. ఆదినుంచీ ఈ పత్రికకు సలహాదార్లు: కాళీపట్నం రామారావు, కవనశర్మ, అత్తలూరి నరసింహారావు, వసుంధర, కోడూరి శ్రీరామమూర్తి, కేతు విశ్వనాథరెడ్డి, డా. ఎన్. సురేంద్ర, వై. రాంబాబు & శాయి, డా. డి.వి.ఆర్. పూషా. రచయితలు మాత్రమే నిర్వహించే ఏకైక పత్రికగా వెలసి, ఆంధ్రుల అంతర్జాతీయ పత్రికగా గుర్తింపు సాధించిన ఈ పత్రిక ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. సాహితీ విలువలకు వ్యాపారగంధం సోకనివ్వకుండా- ఇప్పటికీ ఈ పత్రికను కొనసాగిస్తున్న సంపాదకుడు వై.వి.యస్.ఆర్.యస్. తల్పశాయిని 'రచన శాయి'గా మార్చిన పత్రిక ఇది. ప్రారంభసంచికనుంచీ వివిధ రచయితల వినూత్న శీర్షికలతో అలరించిన ఈ పత్రికలో- కోడూరి శ్రీరామమూర్తి నిర్వహణలోని 'నెల నెలా తెలుగు కథ' పేరిట వివిధ పత్రికల్లో కథలని విశ్లేషించిన క్లిష్టమైన శీర్షిక రచనకు ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. దానితోపాటు మరికొన్ని శీర్షికలు కూడా మరుగైనా- ఇప్పటికీ కొనసాగుతున్నవాటిలో కథాపరంగా ప్రయోజనాత్మకమైనవి రెండు: కథను ప్రచురించి- పాఠకులకు నచ్చిన, నచ్చని అంశాలని సహేతుకంగా ఆహ్వానించి కథకులకి అందజేసే కథాప్రహేళిక; రచనావ్యాసంగానికి సంబంధించిన వివిధ అంశాలని (తిరిగొచ్చిన రచనల విశ్లేషణతో సహా)- ముఖ్యంగా కొత్త రచయితలకోసం- చర్చించే 'సాహితీ వైద్యం'. ప్రచురించబడిన కథల్లో నెలనెలా రెండింటికి ప్రముఖ రచయిత జనార్దన మహర్షి చెరో అర్ధ వెయ్యిన్నూట పదహార్లు అందజేస్తున్నారు. వెయ్యిన్నూట పదహార్లతో సత్కరిస్తూ- ప్రతి నెలా కథకులకి కథల పోటీ నిర్వహిస్తున్న శీర్షిక 'కథాపీఠం'. ఇవికాక అప్పుడప్పుడు విడిగా కథలకూ, కవితలకూ, నవలలకూ విభిన్న తరహా పోటీలు. ఎందరో పాత, కొత్త రచయితలకి ఆలంబనగా, సాహితీ విలువలతో కొనసాగుతున్న ఈ 100-పేజీల పత్రికకి మచ్చుగా ఫిబ్రవరి 2009 సంచిక పరిశీలిద్దాం.

అట్టమీద కథల బొమ్మ. అట్టలోపల కార్టూన్లు. సంపాదకీయం (పేజి 5). పాఠకుల 'ఉత్తర రచన' (6). ప్రముఖుల ఉత్తరాలు (7). పజిలింగ్ పజిల్ (8). కవనశర్మ సీరియల్‌గా యల్లాప్రగడ సుబ్బారావు జీవితచరిత్ర

(12). పదకొండు కథలు: వాటిలో మూడు ఆహ్లాదకర పోటీలో బహుమతి గెల్చుకున్నవి, ఒకటి కథాప్రహేళిక. రెండు అనగనగా మంచివి. సీరియల్‌గా సలీం రాణిగారి కథలు (40). సీరియల్‌గా అల్లాడ స్నేహలత 'రాధా కళ్యాణం' (72). సాహితీవైద్యం (77): ఇందులో 'ముందుమాట'గా మినీకథ, కథకులకి 'కథా కమామీషూ', పాఠకుల 'ఉత్తరాలు', 'టూకీగా' కథల విశ్లేషణ, సంగ్రహంగా ఓ కథాసంకలన 'పుస్తక పరిచయం', సాహితీ పథ్యంగా ఓ మంచి కథ విశ్లేషణ. 'రచనా సమీక్ష' (95). సీరియల్‌గా వంగూరి చిట్టెన్‌రాజు 'అమెరికామెడీ కబుర్లు' (96). మధ్యమధ్య సరదా కార్టూన్లు, సాహితీ విశేషాలు, కబుర్లు.

వీటన్నింటి విలువ నెలకి ఇరవైఐదు రూపాయలు.